

నేడు విజయపురంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణలో భాగంగా ఈనెల 29న విజయపురం మండల ఎంపిడి కార్యాలయంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలిపారు.

అక్టోబర్ 10, 11తేదీల్లో

కలెక్టరేట్ వద్ద విఓఏల ధర్నా



విఓఏల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విఓఏల సమస్యలు పరిష్కారం చేయకుండా, మూడు సంవత్సరాలు కాలపరిమితి విధించడాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 10,11 తేదీల్లో రాష్ట్రకమిటీ పిలుపుమేరకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని గురువారం చిత్తూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విఓఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేతనాలు పెంచుతానని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా కొద్దిగా పెంచిన వేతనాలతో వీరందరినీ 64 సర్క్యులర్ తెచ్చి ఇంటికి పంపించే ప్రయత్నం చేయడం దుర్మార్గం అన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి విధించి అందర్నీ ఉపాధి దెబ్బతీసే పని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. రాజకీయ వేధింపులతో ఇబ్బంది పడుతున్నారని వేధింపులు తట్టుకోలేక ఇప్పటికే కొంతమంది చనిపోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి మంది మహిళలను ఆర్గనైజ్ చేస్తున్న వీవోఏలపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు సమావేశాలకు జనం కావాలంటే తరలించడంలో వీవోఏలు లేకుండా సమావేశాలు జరుపుకోలేని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వారిని రకరకాల పేర్లతో ఇబ్బందులు పెట్టడం సరైనది పద్ధతి కాదన్నారు. లోకో యాప్ పెట్టి వీరి నుండి సమాచారం సేకరించడానికి ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా, 5 జి సిమ్ ఇవ్వకుండా, ఫోన్లు ఇవ్వకుండా వారు ఎలా పని చేయాలని ప్రశ్నించారు. అలాగే జెండర్ విధానాన్ని రద్దు చేయాలని, వయసుతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని, సంఘాల మెర్జింగ్ పద్ధతి మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 10,11రెండు రోజులు నిర్విరామంగా జరిగే ధర్నాను జిల్లాలోని అందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జీను రాజశేఖర్ అధ్యక్షత వహించగా నాయకులు శ్రీధర్, మంగమ్మ ,మాలతి, దేవిక ,మమత, తులసి దేవి, వీవోఏలు పాల్గొన్నారు.

నియోజకవర్గం పూర్తి అభివృద్ధి : పెద్దిరెడ్డి



కార్యక్రమంలో దళిత సర్పంచ్‌ను కుర్చీ లేకుండా వెనుకవైపు నిలబెట్టిన దృశ్యం (వృత్తంలో దళిత సర్పంచ్)

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గాన్ని ఒకే కుటుంబం పేర్లు పరిపాలించింది అభివృద్ధి శూన్యమని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరంలో నియోజకవర్గంలో సంపూర్ణంగా అభివృద్ధి చేశామని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలో పలు ప్రారంభోత్సవాలు గురువారం మంత్రి చేపట్టారు. మండలంలో వాటర్ ప్లాంట్లు 14, వైఎస్సార్ హెల్త్‌సెంటర్లు 6, రైతు భరోసా కేంద్రాలు 4, గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం చేశారు. వాటర్‌షెడ్ ద్వారా లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక సచివాలయంతో పాటు, అర్బికేలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. మన ప్రాంతంలో గతంలో రైతులు ఇబ్బంది పడేవారని, విత్తనాల కోసం లైన్‌లో నిలబడి సొమ్మసిల్లి పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయని అయితే నేడు ఆ పరిస్థితి లేకుండా మొత్తం ఆర్బికేల్లోనే అందుబాటులో ఉంచారని తెలిపారు. మన రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటును పరిశీలించడానికి దేశ, విదేశాల నుండి ప్రతినిధులు వస్తున్నారని తెలిపారు. నేడు మొత్తం 520మంది రైతులకు రూ.1.2కోట్లు విలువ గల వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామని అన్నారు. మన కోసం నిరంతరం కషి చేస్తున్న సిఎం వైఎస్ జగన్‌కు అందరం అండగా నిలవాలన్నారు. ప్రతి కుటుంబంకు పథకాలందే విధంగా పాలన సాగుతుందని చెప్పారు. మన ప్రభుత్వం వచ్చాక ఓటు వేశారా లేదా కూడా చూడకుండా అభివద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరు ఇవ్వాలని కషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించామని తెలిపారు. సిఎం వైఎస్ జగన్ 1500 కోట్ల రూపాయలతో మూడు రిజర్వాయర్లు మంజూరు చేస్తే... టిడిపి నాయకులు కోర్టులో కేసు వేసి అడ్డుకున్నారని చెప్పారు. కేసులు తొలిగిన వెంటనే పనులు చేపడుతామని ఎన్నికలలోగా పూర్తిచేసి నీరు నిలుపుతామన్నారు. యువకులు, పెద్దలు అందరూ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈసమావేశానికి ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు. చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు ఎన్.రెడ్డప్ప, జడ్పీ చైర్మన్ వాసు, పీకేఎం ఉడా చైర్మన్ ఎన్.వెంకట్‌రెడ్డి యాదవ్, టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, జడ్పిటిసి జ్ఞాన ప్రసూన చంద్రారెడ్డి యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు జింక వెంకట చలపతి, మాజీ ఎంపీపీ నరసింహులు, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజురెడ్డి, ఆర్టీసీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జయరామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో

దళిత సర్పంచ్‌పై వివక్ష

తిరుపతి బ్యూరో: రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహించే పుంగనూరు నియోజకవర్గంలో దళిత సర్పంచి పై సమావేశంలో వివక్ష చూపడంతో విషయం దళిత సంఘాలలో చర్చనీయాంశమైంది. పుంగనూరు మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విస్తతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. సింగిరిగుంట గ్రామపంచాయతీ కేంద్రంలో ఆర్‌బికె నూతన భవనాన్ని ప్రారంభోత్సవం చేసి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పంచాయతీకి ప్రథమ పౌరుడైన దళిత సర్పంచ్ ఆంజప్పకు వేదికపై కుర్చీ వేయకపోయినా వేదిక వెనుక వైపు నిలబడి సభలో పాల్గొనడం సంఘటన పలువురిని ఆశ్చర్యపరిచింది. దళిత సర్పంచ్ అని వివక్ష చూపడమేనని పలువురు విమర్శిస్తున్నారు. మంత్రి నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉండటం శోచనీయం. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఎన్.రెడ్డప్ప పాల్గొన్న సహచర దళితున్ని గుర్తించకపోవడం బాధాకరమైన విషయమని పలు దళిత సంఘనేతలు అంటున్నారు.

నేడు ఐదో విడత 'వైఎస్ఆర్ వాహన మిత్ర' విడుదల

6,482 మందికి రూ.6,48,20,000 లబ్ధి

కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైఎస్ఆర్ వాహనమిత్ర పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 5వ ఏడాది నిధులు విడుదల 29వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదో విడత వాహనమిత్ర పథకం ద్వారా జిల్లాలోని 6, 482 మంది ఆటో, ట్యాక్సి, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.6,48,20,000 ప్రభుత్వం నుండీ విడుదల కానుంది. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే వాహన మిత్ర కార్యక్రమంలో మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఆర్‌కే రోజాలతో పాటు ఎంఎల్ఏలు పాల్గొనున్నారు.

నేడు ఐదో విడత వాహన మిత్ర నిధులు విడుదల

రాష్ట్ర ప్రభుత్వం ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, మరమత్తులు చేసుకొనేలా ప్రయివేటు డ్రైవర్లను ఆదుకొనేలా ప్రభుత్వం వైఎస్ఆర్ వాహనమిత్ర పథకాన్ని తీసుకొచ్చింది. ఈపథకం క్రింద అర్హులైన ప్రతిఒక్కరికీ ఏటా రూ.10వేల ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ ఏడాది ఐదో విడత వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం క్రింద జిల్లాలోని 6,482 మంది ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.6,48,20,000 ఆర్థిక సాయం అందించనున్నారు. స్వంత వాహనం కలిగిన డ్రైవర్లకు మాత్రమే వాహనమిత్ర పథకం వర్తిస్తుందనే నిబంధన ప్రభుత్వం పెట్టడంతో అద్దె ఆటోలు, ట్యాక్సీలు, మ్యాక్సీలు, క్యాబ్‌లు నడుపుతున్న డ్రైవర్లకు ప్రభుత్వం నుండీ ఎలాంటి లబ్ధి పొందలేకపోతున్నారు. స్వంత వాహనాలనే నిబంధన తొలగించి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని డ్రైవర్లు కొరుతున్నారు.

ఐదేళ్ళలో ఇలా....

సొంత వాహనం కలిగిన ఆటో, టాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్‌లకు ఇన్సూరెన్స్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్, మరమ్మతులు ఇతర అవసరాల నిమిత్తం ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో ఐదు విడతల్లో అంటే ఐదో విడత వాహన మిత్ర నిధులతో కలిపి జిల్లాలో వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం క్రిందమొత్తం 31,184మంది రూ.31,18,40,000లను రాష్ట్రప్రభుత్వం అందజేసింది.
2019 -20లో 5,879 మందికి రూ. 5,87,90,000,
2020- 21లో 6,674 మందికి రూ.6,67,40,000,
2021- 22లో 6,105 మందికి రూ.6,10,50,000,
2022- 23లో 6,044 మందికి రూ.6,04,40,000,
2023- 24లో 6,482 మందికి రూ.6,48,20,000
ఈ పథకం క్రింద ఆటో, మ్యాక్సీ, క్యాబ్ స్వంత వాహనాలున్న డైవర్లు లబ్ధిపొందారు. ఐదో విడత వాహన మిత్ర పథకం క్రింద రూ. 10వేలు అందించే కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌లో మంత్రుల చేతులమీదుగా ప్రారంభించనున్నారు.

బోనమందలో ప్రబలిన జ్వరాలు

- తరలివచ్చిన జిల్లా అధికారులు
- రక్త పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్‌ఓ

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద గ్రామంలో వారం రోజులుగా జ్వరాలు ప్రబలడంతో గ్రామస్తులు మంచానపడ్డారు. ఈవిషయం జిల్లాస్థాయి అధికారులకు తెలియడంతో డిఎం అండ్ హెచ్‌ఓ, జిల్లా పంచాయతీ అధికారి, వైద్య, పంచాయతీ సిబ్బంది గురువారం బోనమంద గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి తాగునీటి శాంపిల్స్ స్వీకరించి నివేదికలను సిద్ధం చేసినట్టు తెలిపారు. డిఎం అండ్ హెచ్‌ఓ ప్రభావతి మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు ప్రబలి దాదాపు 50మంది అనారోగ్యానికి గురయ్యారని విషయం తెలియడంతో పరిస్థితిని సమీక్షించేందుకు రావడం జరిగిందని తెలిపారు. తాగునీటి శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించి ఫలితాలు రాగానే చేపట్టవలసిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా జ్వరం వచ్చిన రోగుల నుండి రక్త నమూనా సేకరించడం జరిగిందని డెంగీ, మలేరియా పరీక్షలను చేయించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక పంచాయతీ వారితో మాట్లాడి స్వచ్ఛమైన తాగునీరు అందజేసేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామంలోని ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చిన నీటిని తాగాలని పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని మరొక మూడు రోజులపాటు వైద్యశిబిరాన్ని గ్రామంలో నిర్వహిస్తామని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్యపరీక్షలు నిర్వహించుకుని మందులు మాత్రలు తీసుకోవాలని ఆమె కోరారు. పంచాయతీ అధికారి లక్ష్మీ మాట్లాడుతూ తాగునీటి బోరు నుండి వచ్చే నీటిని ప్రజలు కొద్దిరోజులు ఇంటి అవసరాలకు వాడుకోవాలని ట్యాంకర్ల ద్వారా అందజేసే నీళ్లను కాచి చల్లార్చి తాగాలని గ్రామంలో పారిశుధ్యం కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామని తెలిపారు. పెద్ద ఉప్పరపల్లి ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామంలో నీటి గ్రౌండ్ ట్యాంక్



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహణకు

పకడ్బందీగా ఏర్పాట్లు : కమిషనర్



వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 30వ తేదీన టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సంబంధిత అధికారులు, వార్డు అడ్మిన్, ఆరోగ్య కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 30వ తేదీ నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి 31, 32, 33, 34, 35, 36, 22, 42, 43 వార్డు సచివాలయాల పరిధిలో విస్తత ప్రచారం కల్పించాలన్నారు. వాలంటీరు, ఏఎన్ఎం సర్వేలను వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రజలు కూర్చోవడానికి, విభాగలవారీగా వైద్యులు పరీక్షలు నిర్వహించడానికి, మందుల పంపిణీ తదితర వాటికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య శిబిరం నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి విధులు కేటాయిస్తూ సత్వరం ప్రొసీడింగ్ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అధికారులు, వార్డు కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు విజయవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, స్థానిక కార్పొరేటర్ సయ్యద్ సర్దార్, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ప్రభుత్వ ఆసుపత్రి గోడ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గురువారం కురిసిన వర్షానికి ప్రభుత్వ ఆసుపత్రి వెనక వైపు ప్రహరీ గోడ కూలిపోయింది. ప్రహరీ గోడ కూలిపోవడంతో ఆసుపత్రిలోనే అంబులెన్సు చోరీకి గురయ్యే అవకాశం ఉందని, వెంటనే ప్రహరీ గోడను నిర్మించాలని గురువారం ఒక ప్రకటనలో చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు సత్య కోరారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రహరీ గోడ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఆరోగ్యకర వాతావరణ ఏర్పాటు చేయాలని కోరారు.

వేలంపాటలో రూ.95వేలు ఆదాయం

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన ద్విచక్రవాహనాలు వేలంపాటలో ఐదు వాహనాలకు గాను రూ.95 వేలు ఆదాయం వచ్చినట్టు ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలియజేశారు. ఈ వాహనాలు అక్రమ మద్యం తరలింపులు పట్టుబడిన వాహనాలను ఎస్పీ ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహించామని ఆయన తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దుచేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి- పూతలపట్టు : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను పరిష్కారం చేయకుండా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం సరైనది కాదని వారికి ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలాలు డిమాండ్ చేశారు. పూతలపట్టు మండల కేంద్రంలో అంగన్వాడీల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్ వలన అనేక రకాల సమస్యలు ఉన్నాయని అనేక గ్రామీణ ప్రాంతాల్లో నెట్వర్క్ పనిచేయడం లేదని తెలిపారు. 5జి సిమ్ ఉంటేనే పనిచేస్తున్నాయని మరి ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వాటికి సరిపడా ఫోన్లో కూడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి వలన మానసికంగా అనారోగ్యానికి గురవుతున్నారని తగ్గించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుంటే ఉక్కు పాదంతో అణచివేయడం ఏమిటి అని ప్రశ్నించారు. ఉద్యమాలను ఎంత అణచినా రెట్టింపు స్థాయిలో జరుగుతాయని గత అనేక అనుభవాలు అంగన్వాడీ ఉద్యమంలో ఉన్నాయని ప్రభుత్వం గ్రహించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోరాటాలు చేసి సాధించుకున్న హెల్పర్ల ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం గ్రాటివిటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పూతలపట్టు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారిగా వనజ, నీరజ, హేమలతలతో పాటు తొమ్మిది మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

బాలిక మృతిపై రాజకీయం తగదు

- భవ్యశ్రీ మృతిపై మహిళా కమిషన్ ఆరా
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గజ్జల లక్ష్మి




భవ్యశ్రీ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న గజ్జల లక్ష్మి , సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బాలిక మృతిపై రాజకీయాలు చేయడం తగదని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గజ్జల లక్ష్మి హితవు పలికారు. పెనుమూరు మండలం వేణుగోపాలపురానికి చెందిన భవ్యశ్రీ (17) అనుమానాస్పద మతిపై ఆమె గురువారం ఆరా తీశారు. ఈ ఘటన వెలుగుచూసిన రోజే బాధితురాలి తల్లిదండ్రులతో చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినా గజ్జల లక్ష్మి తాజాగా మరోమారు స్పందించారు. పెనుమూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్ఐతో మాట్లాడి భవ్యశ్రీ మృతిపై వినిపిస్తున్న వదంతులపై నిజనిజాల్ని త్వరగా తేల్చాలని కోరారు. ఇప్పటికే అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ ఆమెకు చెప్పారు. భవ్యశ్రీ బాడీ పోస్టుమార్టంలో తీసిన అవశేషాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపించామని, రిపోర్ట్ రాగానే వాస్తవాలు తెలుస్తాయన్నారు. బాలికపై ఏదైనా అఘాయిత్యం జరిగిందని తేలితే.. దోషులు ఎంతటి వారైనా వారికి కఠినంగా శిక్షలు పడేలా దర్యాప్తు కొనసాగించాలని గజ్జల లక్ష్మీ కోరారు. అనంతరం భవ్యశ్రీ నివాసానికి వెళ్లి ఆమె తల్లిదండ్రులను కలిసి ధైర్యం చెప్పారు. భవ్యశ్రీ కుటుంబ దీనస్థితిని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లి ప్రభుత్వసాయం అందేలా చూస్తామని మహిళా కమిషన్ తరపున భరోసానిచ్చారు. మహిళా కమిషన్‌తో పాటు ప్రభుత్వం, న్యాయవ్యవస్థలు మహిళల పక్షాన నిరంతరం పనిచేస్తున్నాయని, ప్రతిపక్షాలు బాలికల విషయాల్లో దిగజారుడు రాజకీయాలు మానేస్తే ప్రజలు హర్షిస్తారని గజ్జల లక్ష్మి తెలిపారు.

భవ్య శ్రీ కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ



చిత్తూరుఅర్బన్: భవ్యశ్రీ మృతి కేసుపై సమగ్ర విచారణ చేయాలని చిత్తూరు జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ బి.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ బృందం ఆ గ్రామానికి వెళ్లి భవ్యశ్రీ కుటుంబాన్ని పరామర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి కేసులు పునరావృత్తం కాకుండా చూడాలని, ఈకేసుపై ప్రత్యేక దృష్టిపెట్టి విచారణ చేపట్టాలని కోరారు. మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు సురేంద్ర, కృష్ణ, జ్యోతి పాల్గొన్నారు.



వెదురుకుప్పం: భవ్యశ్రీ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ నాయకులు నూకతోటి రాజేష్ గురువారం పరామర్శించారు. అనంతరం భవ్యశ్రీ కుటుంబ పరిస్థితిని చూసి వారికి ఆర్థిక సహాయం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పక్కా ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ హేమలత సురేష్ రెడ్డి, జడ్పిటిసి జి.దొరస్వామి యాదవ్, గోవిందరెడ్డి, చక్రవర్తి నాయుడు, వైస్ ఎంపీపీ కోదండన్ ఉన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

ప్రజాశక్తి- సోమల

సోమల మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేడు శుక్రవారం పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు గురికానివారిపల్లెలో ఆర్వో ప్లాంట్, 8.40 గంటలకు పేటూరులో ఆర్వో ప్లాంట్, 9.30గంటల పెద్ద ఉప్పరపల్లిలో షాదీమహల్ నిర్మాణానికి శంకుస్థాపన, అంగన్వాడీ కేంద్రం భవనం ప్రారంభం, 10.20గంటలకు తుగడంవారిపల్లెలో అంగన్వాడి భవనం, పొదలకుంటపల్లి గ్రామ సచివాలయ భవనం, అంగన్వాడీ భవనం, 11.30గంటలకు ఎస్.నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లిలో ఆర్ఓ ప్లాంట్, కరకమందలో ఆర్వో ప్లాంట్, ఎస్.నడింపల్లెలో వెల్నెస్ సెంటర్ ప్రారంభం, 12.50గంటలకు సోమల పోలీస్‌స్టేషన్ వద్ద శివాలయం వద్ద ఆర్వో ప్లాంట్ల ప్రారంభం, సినిమా క్రాస్ వద్ద షాది మహల్ నిర్మాణానికి శంకుస్థాపన, ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లెలో ఆర్వోప్లాంట్ ప్రారంభం, 2.10గంటలకు నెల్లిమంద పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్వో ప్లాంట్, ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభం, 2.40గంటలకు కందూరు గ్రామంలో షాది మహల్, రైతు భరోసా కేంద్రం, ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవం, 3.40గంటలకు తమ్మి నాయునిపల్లి పంచాయతీలో వెల్నెస్ సెంటర్, బిఎంసియు ప్రారంభం, 4.20 గంటలకునాలుగు కామిరెడ్డివారిపల్లె పంచాయతీలో రైతు భరోసా కేంద్రం వెల్నెస్ సెంటర్ అంగన్వాడీ భవనం ప్రారంభం, వల్లిగట్ల పంచాయతీలో సాయంత్రం 5గంటలకు అంగన్వాడి భవనం ఆర్వోప్లాంట్ ప్రారంభిస్తారని మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఎంపీపీ ఈశ్వరయ్య, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర రాయల్ కోరారు.

తెలుగు యువత ఉపాధ్యక్షులుగా

మల్లగుంట నవీన్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగు యువత చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా చిత్తూరు నగరానికి చెందిన మల్లగుంట నవీన్ నియమితులయ్యారు. గురువారం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, అధ్యక్షులు కాజూరు రాజేష్ నవీన్ కుమార్‌కు ఉపాధ్యక్షులుగా నియమిస్తూ అర్హత పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షులుగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలుగుదేశం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు నవీన్ కుమార్ తెలిపారు.



నవీన్ కుమార్‌కు అర్హతపత్రం అందిస్తున్న దొరబాబు

లైంగిక వేధింపులపై సమరభేరి



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : పని ప్రదేశాలలో శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్యపై సమరభేరి మోగించాలని సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన శ్రామిక మహిళా సదస్సు నిర్ణయించింది. యస్. వాణిశ్రీ అధ్యక్షతన జరిగిన సదస్సులో 18 రంగాలకు చెందిన శ్రామిక మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. 2013 వ సంవత్సరంలో పని ప్రదేశంలో శ్రామిక మహిళలు లైంగిక వేధింపులను ఎదుర్కొంటుంటే తీసుకోవలసిన చర్యల గురించి చట్టం ఏర్పడిందని, ఆ చట్టం తిరుపతి జిల్లాలో అమలు కావడం లేదని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉన్నచోట అంతర్గత కమిటీలు ఉండాలని, అనేక చోట్ల ఇలాంటి కమిటీలు లేకపోవడం విచారకరమని వారు విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాల్సిన స్థానిక కమిటీ కూడా ఏర్పాటుకు నోచుకోలేదని విమర్శించారు. గతంలో టీటీడీ పరిపాలనా భవనంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సందర్భాన్ని ఉదహరించారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ఉండాలంటే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. 30వ తేదీ శనివారం శ్రామిక మహిళా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి స్థానిక కమిటీ ఏర్పాటుకు విజ్ఞప్తి చేయాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, సాయిలక్ష్మి హాకర్స్ నాయకురాలు బుజ్జి, కస్తూరి (న్యాయవాది) మల్లెల వాణి జర్నలిస్టు), డాక్టర్ శ్రావ్య, బిఎన్ ప్రసన్న (బ్యాంకు) జి. నాగమణి, ధనలక్ష్మి (ఆటో) ఏ. పద్మజ (ఉపాధ్యాయురాలు), జి. రేవతి (మున్సిపాలిటీ), కే. హేమలత (మెడికల్), పి. శశిరేఖ (రైల్వే), చంద్రమ్మ (అగ్రికల్చర్ కాలేజ్), పద్మలీల, హైమావతి, మంజుల, ముని కుమారి, నాగరాజమ్మ (అంగన్వాడి), సరిత (ఆర్పి), బేబీ రాణి (టిటిడి), త్రివేణి (వాలంటీర్) తదితరులు తమ తమ రంగాలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను సవివరంగా వివరించారు. వీరికి మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, కోశాధికారి కెఎన్ఎన్ ప్రసాదరావు, రమేష్, బాలాజీ, ఎం. రఘు, టి సుబ్రహ్మణ్యం, పి మునిరాజ, కే. వేణుగోపాల్, టి. మురళి, గంగులప్ప, పార్థసారథి పాల్గొన్నారు.

వివిధ కళల్లో పిఇఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా పాకశాస్త్ర కళాశాల తిరుపతి వారు వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పిఇఎస్ పబ్లిక్ పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో జి.తుషార్ ప్రేమ్ మొదటి బహుమతి కైవసం చేసుకోగా, అస్మిత రెండవ బహుమతి, ఇందుప్రియ మూడవ బహుమతిని సాధించారు. క్విజ్ పోటీల్లో సి.వి.జాహ్నవి, వంశీకృష్ణ, చంద్ర హాసిని రెండవ బహుమతిని సొంతం చేసుకున్నారు. పాకశాస్త్ర పోటీల్లో పవన్, యశ్వంత్, ఆదర్శ్ రెండవ బహుమతిని సాధించగా, పూజిత, పుష్యమి, వర్షిత మూడవ బహుమతిని సొంతం చేసుకున్నారు. ఈసందర్భంగా పిఇఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లోని జిజ్ఞాసను తట్టిలేపడానికి ఈపోటీలన్ని దోహదపడతాయని, చదువుతోపాటు అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించే దిశగా ముందడుగు వేయాలని ప్రోత్సహిస్తూ, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కామర్స్ విభాగ అధ్యాపకులు జ్యోత్స్న, రజనీకాంత్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పీఈఎస్ కళాశాల ప్రిన్సిపాల్

జీవో నెం. 5ను రద్దు చేయాలి

నూతన వాహనాలను కొనుగోలు చేయాలి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీవో నెంబర్ 5ను రద్దు చేసి, నూతన వాహనాలను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం చిత్తూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం చిత్తూరు జిల్లా సంఘ భవనంలో ఆలిండియా డ్రైవర్స్ ఫెడరేషన్ సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్ అధ్యక్షులు సందీప్ మోరియాకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో జీవో నంబర్ 5 వెంటనే రద్దు చేయాలని, కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని కొత్త డ్రైవర్ ఉద్యోగాలు నియమించాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వచ్ఛభారత్ కింద వచ్చే వాహనాలకి వాహనంతో పాటు డ్రైవర్ పోస్టు కూడా నియమించాలని ప్రధానమంత్రికి తెలియపరచాలని వారి దష్టికి తీసుకుని వెళ్లాలని తెలిపారు. దానికి సానుకూలంగా స్పందించిన ఆల్ ఇండియా ప్రభుత్వ డ్రైవర్ల ప్రెసిడెంట్ ఈసమస్యని ప్రధానమంత్రి దష్టికి తీసుకొని వెళ్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్లు విన్నవించిన సమస్యలన్ని ఆల్ ఇండియా సెంట్రల్ అసోసియేషన్ లెటర్ ప్యాడ్ మీద ప్రభుత్వ తెలియపరచి సమస్యకు పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సౌత్‌జోన్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మంజిత్ కుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు పన్నీర్ సెల్వం, గౌరవ అధ్యక్షుడు షణ్ముగం, ముఖ్య సలహాదారుడు రామన్న రాష్ట్ర నంబర్ సురేష్ బాబు, బాలాజీ పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.

బిడ్డతో సహా మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మస్థాపంతో బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించిన ఘటన గురువారం స్థానిక కొంగారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల మేరకు చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో మేస్త్రీగా పనిచేసే హరి 10నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కారుణ్య నియామకం కింద సుమతికి ఉద్యోగం వచ్చే అవకాశం ఉండటంతో సుమతి అత్త, చెల్లి, చెల్లెలు భర్త సుమనికి వేధించడం మొదలు పెట్టారు. రెండు రోజుల క్రితం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సుమతిపై దాడి చేయడంతో మనస్థాపానికి గురైన సుమతి గురువారం కొంగారెడ్డి పల్లిలోని తమ ఇంటి మిద్దెపై నుండీ 10 సంవత్సరాల బిడ్డతో సహా క్రిందకు దూకి ఆత్మహత్య ప్రయత్నం చేశారు. తీవ్రగాయాలతో ఉన్న వీరికి స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 10 నెలల చిన్నారి మృతిచెందగా తీవ్రంగా గాయపడ్డ సుమతి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వన్‌టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురిని పరామర్శించారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రగాయాలతో చిత్తూరు ప్రభుత్వఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుమతి

తలక్రిందులుగా నిలబడి టిడిపి నేతల నిరసన



పలమనేరులో..

ప్రజాశక్తి- పలమనేరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ గురువారం పలమనేరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తల్లకిందుల నిలబడి వినూత్న నిరసన చేపట్టారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: అంబేద్కర్ మహాశయ ఆంధ్రప్రదేవ్‌లో రాజ్యాంగాన్ని కాపాడు అంటూ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు ఎం.రవి యాదవ్ శిబిరం వద్ద గురువారం విన్నుతంగా గుండుకొట్టి నిరసన తెలియజేశారు. ఈ రాష్ట్రప్రభుత్వం ఆరాచక పాలనను త్వరలో ప్రజలకు చరమ గీతం పాడే రోజు దగ్గర్లో ఉందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్ , చెంగల్రాయల్ యాదవ్, రుద్రయ్య నాయుడు, జయశంకర్ నాయుడు, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఆంధ్రప్రదేశ్ అభివద్ధి దాతను అరెస్టు చేయడం అన్యాయమని జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని తెలుగుదేశం కార్యాలయంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమం గురువారం 19వ రోజు మండల ప్రధానకార్యదర్శి జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీటీసీ మీనా కుమారి, ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు, వంశి చౌదరి, రమణ, శివతారక పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ కూడలిలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బిఎం.కిషోర్ గౌడ్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, మండల నాయకులు కార్యకర్తలు అనేకమంది పాల్గొని సంతకాల సేకరణ చేశారు.

నగరి: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బాబు తో నేను సైతం నగరిలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో ఈ రిలే దీక్షల్లో నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో జగన్ రెడ్డి ప్రజల చెవుల్లో పూలు పెట్టాడంటూ వినూత్న రీతిలో తెలుగుదేశం శ్రేణులు నిరసన తెలిపారు.

రామకుప్పం: చంద్రబాబు నాయుడు జైలు నుండి విడుదల కావాలని తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైలో టిడిపి నేతలు, కార్యకర్తలు గిరి ప్రదర్శన చేశారు. గురువారం సాయంత్రం 16 కిలోమీటర్ల మేర గిరి ప్రదర్శన చేసి చంద్రబాబు నాయుడు త్వరలో విడుదల కావాలని అరుణాచలేశ్వరుని మొక్కుకున్నారు. వైసీపీ పెట్టిన అక్రమ కేసులు చంద్రబాబును ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు మునస్వామి, జిల్లా ఆర్గనైజర్ సభ్యుడు మనోహర్ , గజేంద్ర పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరులో..

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- పలమనేరు : మండలం విద్యానగర్ స్కూల్ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి లీలారాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈశిబిరాన్ని పలమనేరు, గంగవరం, పెద్ద పంజాణి, బంగారుపాళ్యం మండలాలకు చెందిన 18 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం నుంచి మంజురైయ్యే పరికరాలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెడికల్ క్యాంపుకు వచ్చేవారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు,4 పాసుపోర్టు ఫోటోలు తీసుకొని రావలని తెలిపారు. మరిన్ని వివరాలకు భవిత కేంద్రం ఇంచార్జి మంగేశ్వరి ఫోన్ 9885377508 ను సంప్రదించాలని కోరారు.

పెంచలయ్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని దేవరగుడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి యువనేత పెంచలయ్య గురువారం ఆకస్మికంగా మతి చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి నాయకులు నూకతోటి రాజేష్ అన్నారు. పెంచలయ్య మరణించారన్న విషయం తెలుసుకున్న రాజేష్ ఆ గ్రామానికి చేరుకుని మతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహమ్మద్ ప్రవక్తను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ముస్లిం సోదరులు అన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గ్రామంలోని పురవీధుల్లో ఆయన బోధించిన నీతి సూత్రాలను తెలియజేస్తూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. మొదట మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి అనంతరం గ్రామపురవీధుల్లో ఊరేగించారు.

మురుగు కాలువలు శుభ్రం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో మురుగునీటి సమస్యను సర్పంచ్ క్రిష్ణారెడ్డి పంచాయతీ కార్యదర్శి చిన్న సుబ్రమణ్యంకి గ్రామస్తులు తెలియచేశారు. సర్పంచ్ వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల ద్వారా మురుగునీటి కాలువలు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం రెడ్డి, వైస్‌సర్పంచ్ రాజేంద్ర, ప్రభాకర్ రెడ్డి, ధనపాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో విద్యుత్ నూతన్ లైన్లు, పాత లైన్ల మరమ్మతుల కారణంగా స్థానిక్ సబ్‌స్టేషన్ కార్యాలయం పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని గురువారం ఏఈ హేమచంద్రుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

వెంకటగిరి జాతరలో విఐపి పాస్‌లు బంద్

ప్రజాశక్తి - వెంకటగిరి వచ్చే నెల 4,5 తేదీల్లో జరగబోవు శ్రీపోలేరమ్మ జాతర నిర్వహణ కమిటి మొదటి సమావేశాన్ని గురువారం నేదురుమల్లి నివాసంలో ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి అన్ని రంగాల ముఖ్య వ్యక్తులను ఒక కమిటిగా ఏర్పాటు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో మరింతగా జాతరకు గుర్తింపు వచ్చినట్లు పలువురు పేర్కొన్నారు. ఈ జాతర ప్రజల జాతరగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల జాతరగా జరగాలనే ఉద్దేశంతో 27మందితో అన్నీ రంగాల ముఖ్య వ్యక్తులతో నూతన కమిటిని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈకమిటి సమిష్టి నిర్ణయాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల జాతరగా ప్రశాంతగా నిర్వహిస్తామన్నారు. వెంకటగిరి సంస్థానదీశులు మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర సలహాలు, సూచనలు, సంప్రదింపులతో సాంప్రదాయ బద్ధంగా జాతరను నిర్వహణ సాగుతుందన్నారు. గతంలో విఐపి పాసుల పేరుతో భక్తులకు అసౌకర్యం కలగేదన్నారు. ఈసంవత్సరం విఐపి పాసులను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు తీర్మానించారు. ఈ విఐపి పాసుల కారణంగా సామాన్య భక్తులకు అమ్మవారిని దర్శించుకోవడం ఆలస్యం అయ్యేదన్నారు. ఉచిత దర్శనాలు ప్రశాంతంగా జరిగేందుకు ఈనిర్ణయం తీసుకున్నామన్నారు. ఊరేగింపు రోజు అమ్మవారని ట్రాక్టరులో కాకుండా గతంలో రథంపై ఊరేగింపు సాగే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు.పట్టణ ప్రజలకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విషయము కమిటి ముందుంచి సమస్యలు లేకుండా చూసుకుంటామన్నారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ కన్వినర్ ఢీల్లిబాబు మాట్లాడుతూ విఐపి పాసుల ఎత్తివేయడం మంచి నిర్ణయమని ఈనిర్ణయముతో సామాన్యులకు అసౌకర్యం కలగకుండా ఉంటుదన్నారు. ఆవుల వెంకటేశ్వర్లు సిపిఎం వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య, డాక్టర్ కళాధర్ పాల్గొన్నారు.

'జిపిఎస్'తో మోసం చేసిన జగన్

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విమర్శ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎన్నికల ముందు ఉద్యోగస్తులకు, తమ ప్రభుత్వం వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేస్తానని, నాలుగు సంవత్సరాల తర్వాత, అసెంబ్లీలో జిపిఎస్ తీసుకొచ్చి, ఉద్యోగస్తుల్ని నీట్టనిలువునా మోసం చేశారని చిత్తూరు జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తర్వాత ఇచ్చే పెన్షన్, కాంట్రిబ్యూటీ పెన్షన్ వల్ల దాదాపు 4 లక్షల మంది ఉద్యోగుల నష్టపోతారని తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్, ఓపిసి అమలు చేస్తే రాష్ట్రం దివాలా తీస్తుందని శాసనసభలో ప్రకటించారని, ఇది చాలా అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో వాగ్దానం చేసినప్పుడు గుర్తు లేదా, ఓట్లు దండుకున్న తర్వాత మాట తప్పడం మోసం చేయడం జగన్‌కి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో, ఏకపక్షంగా మూజవాని ఓటుతో జిపిఎస్‌కు ఆమోదం తెలిపారని, శాసనమండలిలో సిపిఎం తరపున పిడిఎఫ్ ఎమ్మెల్సీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకోవడం జరిగినదని, అయినా ముఖ్యమంత్రి హామీన అమలు చేయకుండా, ఏకపక్షంగా ఆమోదించడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, టీచర్లకు, తీరని అన్యాయం చేశారన్నారు. దీనికి ఏమాత్రం ఉద్యోగులకు ఆమోదం కాదన్నారు, ఓల్డ్ పెన్షన్ స్కీమును సాధించేవరకు పోరాడే ఉద్యోగులకు సిపిఎం అండగా నిలబడుతుందని తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి- గంగవరం : మదర్ థెరిసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు వాల్ పోస్టర్లను ఆవిష్కరించినట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలియజేశారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ సదస్సు అక్టోబర్ 17,18 తేదీలలో కాలిఫోర్నియా యూనివర్సిటీ లెండి ఇన్స్టిట్యూట్ అండ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సు కంప్యూటర్ ఫర్ సైన్స్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ అంశంపై నిర్వహిస్తారని, ఈ సదస్సుకు భారతదేశం యూనివర్సిటీతోపాటు ఇతర దేశాల వారు కూడా పాల్గొంటారని తెలపారు.

తెలుగు రాష్ట్రాల్లో కోటి భగవద్గీత పుస్తకాలు ముద్రణ : టిటిడి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

తెలుగు రాష్ట్రాల్లో కోటిమంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయనున్నట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. తమిళనం, కన్నడ, హిందీలోనూ ముద్రించే ఆలోచనలో టిటిడి ఉందన్నారు. సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని మరింత పెద్దఎత్తున నిర్వహించడంలో భాగంగా భగవద్గీతను విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో రాయించి పుస్తకాలుగా ముద్రించి తెలుగు రాష్ట్రాల్లో కోటి మందికి పంపిణీ చేస్తామని తెలిపారు. చెన్నయ్ స్థానిక సలహా మండలి ఛైర్మన్‌గా గురువారం ఎజె శేఖర్‌రెడ్డి సమాచార కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆచార్య పురుషులు, హైందవ ధర్మ పెద్దల సూచనలతో రాబోయే రోజుల్లో పెద్దఎత్తున హైందవ ధర్మ ప్రచార కార్యాచరణకు దిగుతామని తెలిపారు. తమ ధర్మకర్తల మండలి తొలి సమావేశంలోనే రామకోటి తరహాలో గోవిందకోటి పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 25ఏళ్లలోపు వయస్సున్న వారు గోవింద కోటి రాస్తే వారితో పాటు కుటుంబ సభ్యులకు బ్రేక్ దర్శనం కల్పించాలని బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. చెన్నయ్, కాట్పాడి మార్గాల నుంచి తిరుమలకు నడచి వచ్చే భక్తుల కోసం విడిది కేంద్రాలు నిర్మిస్తామన్నారు. భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ నుంచి అనుమతి లభిస్తే తిరుమల నడకదారి వెంబడి ఫెన్సింగ్ నిర్మించే ఏర్పాటు చేస్తామన్నారు. చెన్నయ్ స్థానిక సలహా మండలి ఛైర్మన్ ఎజె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నయ్‌లోని శ్రీవారి ఆలయం, పరిసరాలు ప్రస్తుతం 5.5 గ్రౌండ్ల స్థలంలో ఉన్నాయన్నారు. ఆలయాన్ని 11 గ్రౌండ్ల స్థలంలో విస్తరిస్తామన్నారు. స్థలం కొనుగోలుకు ఇప్పటివరకూ 19 కోట్లు విరాళంగా వచ్చిందన్నారు. కన్యాకుమారి, తిరుచ్చి, మధురై, కోయంబత్తూరుల్లో శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు డాక్టర్ శంకర్, మాజీ బోర్డు సభ్యులు కుమార గురు ,డెప్యూటీ ఈవో విజయ కుమార్ పాల్గొన్నారు.

రూ.కోటి విరాళం

చెన్నై లోని శ్రీవారి ఆలయ విస్తరణకు అవసరమైన భూమి కొనుగోలు కోసం ట్రూ వ్యాల్యూ హోం సంస్థ తరపున వారి ప్రతినిధి రవిచంద్రన్ కోటి రూపాయల చెక్కును టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డికి అందజేశారు.

ఎస్వీయూలో 'పందుల పెంపకం'

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో విద్యార్థుల మధ్యనే పందులు సైతం యథేచ్ఛగా తిరుగులాడుతున్నాయంటే భద్రత డొల్లతనాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే విశ్వ విద్యాలయంలో బయటి వ్యక్తులు కారు, బైక్, స్కూటీ రేస్‌లు జరుపుతున్నారు. ఆడిటోరియంపై జంటలు జంటలుగా విందులు వినోదాలు నిర్వహిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

వర్సిటీలో ఏ గేటు నుంచి ఏ బయట వ్యక్తి వస్తాడో, ఏ అఘాయిత్యం చేస్తాడో, ఏ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతాడో తెలియదు. దీనికితోడు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా పందులు స్వైర విహారం చేస్తుంటాయి. ఉదయం, సాయంత్రం హాటళ్లలో మిగిలిపోయిన అన్నం, ఇతర పదార్థాలను తీసుకొచ్చి అక్కడ

భద్రత డొల్లతనంతో వెలుగులోకి...



ఇదే ఎస్వీయూ స్వచ్ఛభారత్

వేయడంతో పందులు వీటి కోసం నిత్యం వస్తుంటాయి. ప్రకాష్‌నగర్‌లో వర్సిటీ సిబ్బంది నివసించే ప్రాంతంలోనూ పందులకు మేతగా చెత్తను తీసుకొచ్చి వేస్తుంటే అడిగే దిక్కులేదు. ఒకవేళ అడిగినా బెదిరింపులు తప్పవు. బోధన, బోధనేతర సిబ్బంది నివసించే క్వార్టర్స్‌వద్ద పందులు తిరుగుతూ కనిపిస్తాయి. ఇంజినీరింగ్ కళాశాల, ఎన్‌సిసి నగర్, ప్రకాష్‌నగర్ సమీపంలోనే కాకుండా బాలికల వసతిగృహం వన్ వెనుక ప్రాంతంలో, బాలికల వసతి గృహం టు పక్కన, ఇంజినీరింగ్ హాస్టల్స్ వెనుక, హెచ్‌బ్లాక్ ఎదురుగా, ఐ బ్లాక్ పక్కన, జి బ్లాక్ వెనుక ఇలా పలు ప్రాంతాల్లో పందులు తిరుగుతూనే ఉంటాయి. అనేకమార్లు విద్యార్థిసంగాల నేతలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా 'ఆ పందులా' అని నవ్వి వదిలేస్తున్నారు. పందుల వల్ల విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. అయినా ఉన్నతాధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. ఓ వైపు కుక్కలు, పందులు, మరోవైపు చిరుతలతో సహవాసం చేస్తూనే విద్యార్థులు చదువులు లాక్కొస్తున్నారు.